కథ

# తప్పులో కాలు

తమిరిశ జానకి

ఈమధ్యే పెళ్లయింది బ్రహ్మానికి. భార్య సుమతి దగ్గర మార్కులు కొట్టేయాలని పథకాలు వేసి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు అప్పుడప్పుడు, కానీ అవన్నీ విఫలం అవుతూనే ఉన్నాయి సఫలం కాలేదింతవరకూ. తప్పులో కాలేస్తూనే ఉన్నాడు.

సినిమాల్లో చూపించే ప్రేమలు... ఆ సంభాషణలు... దిబ్బాదిరుగుండాలు ఇష్టం లేదు బ్రహ్మంకి. అతిగా పోవడాలు అతిశయోక్తిగా భావిస్తాడు.

కానీ... సుమతి తనకి చెప్పకుండానే ఆమెకి ఏవైనా పనులు అకస్మాత్తుగా తాను చేసి ఆశ్చర్యపరిచేసి మార్కులు కొట్టేయాలన్న ఆశ చిగురంతో చిటికెడంతో మనసులో ఉంది. అందుకే తన పాట్లు తను పడుతూనే ఉన్నాడు.

ఓ రోజు... "కందిపప్పు అయిపోయింది. ఇప్పుడెళ్లి తీసుకొస్తాను" అంటూ బయల్దేరబోయింది సుమతి. మరేం చేస్తుంది? మగ మహారాజు టీవీకి అతుక్కుపోయి ఉన్నాడు, కందిపప్పు నక్షత్రాలుగా మారి ఆకాశంలోకి ఎందుకు వెళ్లిపోయింది అన్న చర్చ చూస్తూ.

సుమతి మాట వింటూనే చటుక్కున లేచాడు ఇంత మంచి భర్త ఎవరికీ ఉండడు అని తన భార్య పొంగిపోవాలని.

"ఇప్పటిదాకా పాపం... ఏదో ఒక పని చేస్తూనే ఉన్నావు. నే తెస్తాలే చిటికెలో వెళ్లి" బయల్దేరిపోయాడు.

"ఒకటో తేదీ సరుకులన్నీ కొనుక్కున్నప్పుడు మళ్లీ కొనుక్కుందాం. ఇప్పుడొక పావు కిలో తీసుకురండి చాలు" వెనకనించి హెచ్చరిక చేసింది సుమతి.

కొట్టిన బంతల్లే రయ్యిన కొట్టుకి చేరాడు గాని.... కందిపప్పు పేరు మార్చేపోయాడు. రోజూ పప్పన్నం లాగించడం తెలుసుగానీ ఎదురుగా అక్కడున్న నాలుగు రకాల పప్పుల్లో ఏదో తెలియలేదు. ఇంతలో ఒకాయన హడావిడిగా వచ్చి ఒక బస్తాలో పప్పు చూపిస్తూ పావు కిలో కట్టవోయ్ అన్నాడు. భయం భయంగా ఆ పప్పునే నాలుగు బద్దలు చేతిలోకి తీసుకుని ఏదో అపరాధం చేస్తున్న వాడికిమల్లే చూశాడు బ్రహ్మం.

"తాజా పప్పు సార్.. ఇంత మంచి పప్పు మీకు ఇంకెక్కడా దొరకదు.. తీసుకోండి ఓ నాలుగైదు కిలోలు" ఊదరగొట్టేశాడు కొట్టు యజమాని.

నాలుగైదు కిలోలు తీసుకోమంటుంటే మరీ పావు కిలో ఇయ్యి అంటే ఎగాదిగా చూస్తాడేమో! మొహమాటం ముందు పుట్టి తర్వాత తను పుట్టిన బ్రహ్మం నాలుగున్నర కిలోలు ఇమ్మన్నాడు మధ్యస్తంగా. ఎగాదిగా అప్పుడు చూశాడు కొట్టు యజమాని.

చచ్చీ చెడి చాయంగల విన్నపాలని తరచుగా అంటుంటే అమ్మమ్మ చచ్చి ఏ లోకాన ఉందో గానీ ఆవిడ అనే ఆ మాట గుర్తొచ్చింది బ్రహ్మానికి. దానికి అర్థం ఏమిటో తెలియదు గానీ.... సుమారుగా అలా పప్పు షాపింగ్ ముగించుకుని ఇల్లు చేరాడు.

"అయ్యో రామా! కందిపప్పు తెమ్మంటే సెనగపప్పు తెచ్చారేవిటీ?" ఇంత పొడుగు దీర్ఘం తీసింది సుమతి.

గుండెల్లో రాయీ నెత్తిన పిడుగూ ఒకేసారి పడ్డాయి.

ఇంక చదివింపులు మొదలయ్యాయి.

"చెప్పింది పావు కిలో కందిపప్పు అయితే ఇన్ని కిలోల సెనగపప్పు తెచ్చి పడేస్తారా? వడలు చెయ్యడం హెచ్చాపాడా నాకు? అయినా అన్నం మానేసి రోజూ వడలు తింటారా ఎవరన్నా?" వంటింట్లో కొనసాగుతున్న చదివింపులకి వాద్యగోష్ఠి కూడా తోడయ్యింది.

★ ★ ★

ఆ రోజు ఆఫీసులోంచి బయటికి రాగానే రోడ్డుకటువైపు తోపుడు బండిలో పువ్వులు కనిపించాయి బ్రహ్మానికి. ఎప్పుడూ ఇంతవరకూ చెయ్యని పని... సుమతికి పూలు కొని తీసికెళ్లి ఆశ్చర్యం ఆనందం కలగజేసెయ్యాలనుకున్నాడు. స్కూటర్ మీద కూర్చునే.... జేబులోంచి ఓ పది నోటు తీసి ఇవ్వబోయి పెద్ద మనసు చేసుకుని ఇంకో పదిహేను కూడా చేర్చి ఇచ్చి పూలియ్యమన్నాడు. వాడు పెద్ద పాలిథీన్ కవరు చేతిలోకి తీసుకున్నాడు. అందులో అయితే వెళ్లగానే సుమతికి కనపడిపోతాయన్న ఆలోచనొచ్చి... పైకి కనపడకుండా న్యూస్‌పేపర్లో కట్టియ్యవయ్యా అన్నాడు. సరే అన్నట్టుగా తల ఊపుతూ "గుమ్మానికే కదా సార్!" అడిగాడు వాడు.

పిచ్చాడిని చూసినట్టు చూశాడు బ్రహ్మం... వీడికింకా పెళ్లయి ఉండదు. ఇంకేం అవుతుంది? ముదురు బెండకాయిలా ఉన్నాడు.... పెళ్లి కాలేదు కాబట్టే గుమ్మాలకి పూలు కట్టుకోవడం ఒక్కటే తెలిసి ఉంటుంది వీడికి. అయినా ఎందుకో ఏవిటో వీడికి చెప్పుకోవలసిన అవసరం తనకేంటి? కాస్త కళ్లెర్ర చెయ్యాలి ఇలాంటి వాళ్ల మీద... లాభం లేదు.

"నీకెందుకోయ్? ఎందుకో చెప్తేగానీ ఇవ్వవా? నేనేమన్నా తీవ్రవాదినా? బాంబులో తుపాకులో కొంటున్న వాడిని అడిగినట్టు నీ ప్రశ్నలేమిటి?" సాగిపోయింది వాగ్ధాటి...ఈసారి పూలవాడు చూశాడు బ్రహ్మాన్ని పిచ్చివాడిని చూసినట్టు.

★ ★ ★

ఈల వేసుకుంటూ కాలింగ్ బెల్ నొక్కాడు. పూలు చూసి సుమతి మొహంలో ఎలాంటి భావాలు కదలాడతాయో ఊహించుకుంటూ నిలబడ్డాడు. అబ్బో.... ఎంత పెద్ద పెద్ద పూలో ఇన్ని పూలే?.... అన్నీ నాకే.... అంటూ ఎంత మురిసిపోతుందో?

తలుపు తీసిన మనిషిని పట్టించుకోలేదు. కొత్త పనిమనిషి కాబోలు.... ఇలాంటి అవతారాన్ని పెట్టుకుందేమిటి?.... ఈ భరించే వాడి మీద నమ్మకం లేదన్న మాట... అయినా ఎందుకొచ్చిన గోల? పనిమనిషిని పరికించి చూడరాదు అని పెళ్లిరోజే పెట్టేసిందిగా నియమనిబంధన...

వెళ్లిపేము కుర్చీలో కూలబడి ఆ రెండు గదుల ఇల్లూ అదిరిపోయేలా ఓ కేక వేశాడు "సుమీ... ఎక్కడున్నావు?"

"ఇదేవన్నా అంతఃపురమా? పెద్ద భవంతా? అంత కేక ఎందుకూ? పైగా తలుపు తీసిన దాన్ని ఇక్కడే ఉంటే నన్ను చూడనట్టు ఆ నటనెందుకూ?"

ఆ మాటలు వచ్చినవైపు చూసి కెవ్వుమనబోయి నోరు నొక్కుకుని లేచి నిలబడ్డాడు... "నువ్వు... నువ్వు..."

"నేనే... ఏం? పొద్దున్న వెళ్లి సాయంత్రం వొచ్చేటప్పటికే మర్చిపోయారా నన్ను?" తలకి హెన్నా పెట్టుకుని పాలిథిన్ క్యాప్ కట్టుకుని.... మొహం మెడా చేతులూ పిండిముద్దలా చేసుకుని.... పాతది చారల చారల చీరతో సుమతి.


"ఏవిటి ఈ అవతారం?" మాట పెగిలింది నోట్లోంచి.

"మధ్యాహ్నం టీవీలో సౌందర్య రహస్యాలు చూశానండీ. పక్కింటావిడ చీరలు తెచ్చిందట అమ్మకానికి. నన్నూ ఇంకో అయిదారుగుర్ని రేప్పొద్దున్న రమ్మంది వాళ్లింటికి చీరలు చూసుకుందుకు. ఆ వొచ్చే వాళ్లు ఎంతంత మేకప్‌లు చేసుకునొస్తారో ఏవిటో? ఇవన్నీ పూసుకోడానికి రేప్పొద్దున్న నాకు సమయం చాలదు మరి.... అందుకే ఇప్పుడు రాసేసుకున్నాను..."

"పెళ్లయ్యాక వేస్తున్నావేంటి పెళ్లికి ముందు వెయ్యాల్సిన వేషాలు?"

"అంటే మీ ఉద్దేశ్యం నేను వేషాలేసేదాన్నా?"

"అయ్యయ్యో! అంత లోతుగా అర్థాలు తియ్యకు సుమీ... మా ఇంట్లో నేను ఒక్కడినే సంతానం మా అమ్మానాన్నలకి. అటు నాలుగు తరాలు ఇటు నాలుగు తరాలు ఆడపిల్లలు లేరు మా కుటుంబాల్లో. ఎవరో ఎప్పుడో ఎక్కడో అనుకోడం విన్నాను. ఆడ



పిల్లలు పెళ్లయ్యేదాకా అందంగా తయారయ్యి వేషాలేస్తుంటారని...."

"అదిగో మళ్లీ అదే మాట.... వేషాలెయ్యడం ఏమిటి?"


"అయ్యో రామ... చెడ్డ అర్థంతో అనట్లేదు సుమీ! ఈ తల ఈ మొహం వీటిని అంటున్నాను."

"ఇదుగో! నన్ను అంటే అనండి గానీ... నా తలనీ మొహాన్నీ అంటే సహించలేను."

పెళ్లి కాక ముందు తన తండ్రి ఒక్కడే చండప్రచండుడు అనుకుంది... ఆయన అంతే. ఆడపిల్లలు మాటాడకూడదు.. నవ్వకూడదు. సౌందర్యం పెంచుకోడానికి ఏ పూతలూ పుయ్యకూడదు. జుట్టు అలా దువ్వకూడదు ఇలా దువ్వకూడదు.... అంటూ ఆంక్షలు హుంకరింపులే ఎప్పుడూ.... పెళ్లయ్యాక ఇప్పుడదో రకం. ప్చ్... చేసుకున్నవాళ్లకి చేసుకున్నంత మహాదేవ అన్నారు పెద్దలు.... నిట్టూర్చింది సుమతి.

మనసులో అనుకున్నది మాటల్లో సరిగ్గా వ్యక్తం చేయలేకపోతున్న తను ఇంక మాటలు ఆపి చేతల్లో నిరూపించుకోవాలని సిమెంటు కట్టడంలా కట్టుబడిపోయాడు బ్రహ్మం.

"సుమీ! ములక్కాడల్లాంటి నీ చేతులు ముందుకి చాపి... ప్రస్తుతం ఈ తేలికపాటి చిన్న




కానుకలో నేను పారబోసి ఇస్తున్న ప్రేమని అందుకో"

ఎంత గొప్పగా ఉన్నాయి వర్ణనలు... వెర్రెత్తిపోయింది సుమతికి.

కోమలమైన చేతులంటే ములక్కాడలా? ప్రేమ ఒలికించడం అనేదాన్ని ప్రేమ పారబొయ్యడం అని ఎంత సొంపుగా చెప్పాడు? ఒళ్లు మండుకొచ్చింది. కానీ... ఆ కానుక ఏదో ఎందుకు ఒదులుకోవాలని చేతులు ముందుకి చాపింది. కాస్త ఎత్తు నించి పూలపొట్లం ఆ చేతుల్లోకి జారవిడిచాడు.... ఆ వొంటిన ఉన్న పిండి తనకి ఎక్కడ అంటుకుంటుందో అని... ఒక్క క్షణం శ్వాస కూడా బంధించుకున్నాడు దగ్గిరకి వెళ్లినందువల్ల వచ్చిన ఆ పిండీ గోరింటాకూ కలగలిసిన వాసనకి తట్టుకోలేక.

పొట్లం ఇప్పిన సుమతి కనుగుడ్లు తేలవేసిన దానిలా అయ్యింది గుమ్మాలకి కట్టుకునే ఆ బంతి పూలు చూసి.... పూల సందుల్లోంచి మెలికలు తిరుగుతూ పాక్కుంటూ పైకి వస్తున్న.... ఆకు కూరల్లో ఉండే లాంటి పురుగులు రెండు కంటపడి అసహ్యం భయం కలగలసి ఒక్క అరుపు అరిచి పొట్లం మొత్తం విసిరిపడేసి పరిగెత్తి నీళ్లగదిలోకి దూరి తలుపేసుకుంది.

ప్రశ్నార్థకం మొహం పడిపోయింది బ్రహ్మానికి.... ఈ పూలు సరిపోవని తక్కువ తెచ్చానని కోపం వచ్చిందేమో? ఏ తలకి ఎన్ని పూవులు కావాలో తెలియని తన అమాయకత్వాన్ని క్షమించకూడదా? ఒకవేళ... ఈ మాత్రానికే అలిగి పుట్టింటికి పోతానని అనదు కదా?

తలుపు దబదబ బాదాడు "సుమీ! సుమీ!"

"వొస్తున్నా" తాపీగా సమాధానం ఇచ్చింది సుమతి మొహం చేతులూ నీళ్లతో కడుక్కుంటూ. నిజానికి పొద్దున్నించీ కడుపులో తిప్పుతుంది. ఆ పురుగుల్ని చూడగానే వాంతి వొచ్చినట్టయి నీళ్ల గదిలోకి పరిగెత్తింది.

భార్య శాంతంగానే జవాబివ్వడంతో బ్రహ్మం మనసు కుదుటపడింది. ఇంకెప్పుడూ తనకి కోపం తెప్పించ కూడదని గట్టిగా నిశ్చయించేసుకున్నాడు. కిందపడిన పూలన్నీ ఒక పళ్లెంలోకి ఏరి హారతి పళ్లెంలా పట్టుకుని ఆ తలుపు దగ్గర నుంచున్నాడు. కోపం తగ్గిందిగా. ఇప్పుడు పెట్టుకుంటుంది... పాపం.. వెర్రి పిల్ల అనుకుంటూ.

○



## కొత్త క్రేజ్ వస్తుందా?

*తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో గుర్తింపు తెచ్చుకున్న నమితకి హీరోయిన్‌గా కంటే సెక్స్‌బాంబ్‌గానే ఎక్కువ పేరొచ్చింది. ఒకసారి ఒక ముద్ర పడిపోయిన తర్వాత మళ్లీ హీరోయిన్ వేషాలేస్తానంటే ఎవరు మాత్రం ఇస్తారు. అందుకే రాజీపడిపోయి తన పాత్ర ప్రాధాన్యత చూసుకుంటూ వీలైనన్ని చిత్రాలకు సైన్ చేస్తోంది. ఇప్పుడు లేటెస్ట్‌గా బాలకృష్ణ సరసన 'సింహా'లో, పోసాని సరసన 'మిస్ చింతామణి', 'దేశద్రోహి' చిత్రంలో పోలీసాఫీసర్‌గా నటిస్తున్న నమితకి కనీసం ఇప్పుడైనా కొత్త క్రేజ్ వస్తుందో రాదో వేచి చూడాలి.*